RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -79 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 31 మార్చి 2026


# 2029 కల్లా అందరికీ ఇళ్లు

## 5.50 లక్షల గృహప్రవేశాలు చేయించాం -1 నుంచి రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు

## ప్రజాభిప్రాయం తెలుసుకుని మెరుగైన పాలన అందిస్తాం : సూళ్లూరుపేటలో చంద్రబాబు

**తిరుపతి మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని అర్హులందరికీ 2029 కల్లా గృహవసతి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రెండో విడతల్లో 5.50 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు చేయించామని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి మరో రెండు లక్షలు, సెప్టెంబర్ కల్లా మరో 1.60 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. మిగిలిన పేదలకు ఎన్నికల హామీలో భాగంగా నగరాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మండలం బిరుదువాడలో 2,064 టిడ్కో ఇళ్లను సోమవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. కొత్తింట్లోకి వెళ్లిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారు ముక్కర అంబిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. **మిగతా**




# నక్సలిజం దాదాపు అంతమైంది



## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

## ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు

## సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు

## నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన

**న్యూఢిల్లీ,,మార్చి 30 ఆంధ్ర ప్రగతి** చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్దాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు‘ అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్దాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. **మిగతా 2లో...**

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

### ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ



**హైదరాబాద్‌మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...**మిగతా 2లో...**

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

### త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి

### మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్,,మార్చి 30 ఆంధ్ర ప్రగతి** :ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. ‘ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం **మిగతా 2లో...**




# తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

**మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు**

**విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న పీ4 కార్యక్రమం**

**తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో వార్షికోత్సవం**

**ఆకట్టుకున్న ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన**

**మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో ముచ్చటించిన చంద్రబాబు**



2లో.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

### 8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు

### కోవూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం

### ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల

**నెల్లూరు, మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు**మిగతా 2లో...**



# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

### బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా



**పాట్నా,మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు**మిగతా 2లో...**

# 50 శాతం సీట్లు పెంపువెనక పెద్ద కుట్ర

**దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ**

**ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ**

**ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన**

**నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు**

**త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ**

**కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది**

**మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి**



2లో.




# దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

**‘సహజీవన జంటలకు‘ కూడా కుటుంబ హోదా**

**2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ**

**ఈసారి జనాభా లెక్కల్లో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల మార్పు**

2లో.

# నక్సలిజం దాదాపు అంతమైంది

**మొదటిపేజీ తరువాయి**

మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం‘ అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. ‘నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. ‘రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు ’సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు’ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది.ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు ’ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు’ జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎ÷-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం‘ అని హెచ్చరించారు.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**మొదటిపేజీ తరువాయి**

ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు.

ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ పథకాలకు భిన్నంగా, మానవతా దృక్పథంతో పేద కుటుంబాలను ఆదుకునే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ఈ వేడుకల్లో వివరించారు.ఈ కార్యక్రమంపై రూపొందించిన ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. పీ4 కార్యక్రమం ద్వారా గత ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10.39 లక్షల పేద కుటుంబాలను ‘మార్గదర్శులు‘ దత్తత తీసుకున్నట్లు ఏవీలో వెల్లడించారు. వీరిలో ఇప్పటికే 2.1 లక్షల కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురాగలిగామని తెలిపారు. సమాజంలోని ధనిక వర్గాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ‘మార్గదర్శులు‘గా వ్యవహరిస్తూ పేద కుటుంబాలను ‘బంగారు కుటుంబాలు‘గా దత్తత తీసుకుంటున్నారు. వారికి జీవనోపాధి మార్గాలు చూపడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ, పిల్లల చదువుకు చేయూత, గృహ నిర్మాణం వంటి అనేక రూపాల్లో సహాయం అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేడు లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాలు భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేవలం ప్రభుత్వ పథకాలతోనే కాకుండా, పౌర సమాజ భాగస్వామ్యంతో పేదలను పైకి తీసుకురావాలనే ఆలోచన అద్భుతమని పలువురు మార్గదర్శకులు ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త సామాజిక మార్పుకు నాంది పలుకుతోందని అభిప్రాయపడ్డారు.

# సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వడ్డీ రేట్లు యథాతథం

**న్యూఢిల్లీ,,మార్చి 30 ఆంధ్ర ప్రగతి**




చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పథకాల వడ్డీ రేట్లలో వరుసగా ఎనిమిదోసారి ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి వర్తించిన వడ్డీ రేట్లు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు కొనసాగుతాయని ఆర్థిక శాఖ తెలిపింది.సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకం కింద చేసే డిపాజిట్లకు 8.2 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్లకు 7.1 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. పీపీఎఫ్‌కు 7.1 శాతం వడ్డీ రేటు వర్తిస్తుంది. పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లలో మార్పులేదు.

పోస్టాఫీస్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. కిసాన్ వికాస్ పత్ర పథకానికి 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకానికి 7.7 శాతం, పోస్టల్‌లో నెలవారీ ఆదాయ పథకంపై (ఎంఐఎస్) 7.4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం చివరిసారి 2023-24 నాలుగో

# దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

**న్యూఢిల్లీ,,మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై ‘కుటుంబం‘గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

## రెండు దశల్లో జనగణన:

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో ‘గృహ గణన‘ (చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు.

రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.

జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు.ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

# 2029 కల్లా అందరికీ ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి**





సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. మరో లబ్ధిదారు షేక్ నూరి కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయం ప్రకారం గృహప్రవేశంలో పాల్గొన్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ రెండు కుటుంబాలకు చెందిన సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించి, టిడ్కో స్వాధీన పత్రాలను అందించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ గృహప్రవేశాలకు రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ‘ప్రజావేదిక’ బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత 30 ప్రాంతాల్లో 2,50,983 టిడ్కో గృహాలను పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయం తెలుసుకుని మెరుగైన పాలన అందిస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. గత పాలకులు మూడు ముక్కలాటతో రాజధానిని ముక్కలు చేశారని, అందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు.

## భవిష్యత్తులో పైపు ద్వారా గ్యాస్ సరఫరా

దీపం 2.0 కింద మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామని, భవిష్యత్తులో పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేస్తామని చంద్రబాబు తెలిపారు. పైప్‌లైన్ ద్వారా ఎలా తాగునీరు వస్తుందో, అలాగే గ్యాస్‌నూ పైప్‌ల ద్వారా అందుబాటులోకి తెస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇవ్వాల్సి ఉన్నా, గత పాలకులు నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకాన్ని కొనసాగించేలా చేసి ప్రతి ఇంటికీ నీరందిస్తామన్నారు. ఇంటిపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకొని సొంతంగా విద్యుత్ తయారు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ఉచిత విద్యుత్తు కొనసాగిస్తామన్నారు. 63 లక్షల మంది పేదలకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మహిళా దినోత్సవం నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేయాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల కల్లా మహిళా రిజర్వేషన్ వస్తుందని, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు.

## తీరప్రాంతంలో గస్తీ పెంచండి

రాష్ట్రంలోని మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పొరుగు రాష్ట్రాల మత్స్యకారులు అక్రమంగా మన రాష్ట్రంలోకి చేపల వేటకు రాకుండా తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు సంయుక్త చర్యలతో కట్టడి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. మన తీరప్రాంత మత్స్య సంపద మన ప్రాంత మత్స్యకారులకే దక్కాలని, తమిళనాడు, పుదుచ్చేరి నుంచి వచ్చే వాళ్లను వేట చేసుకోనీయబోమన్నారు. పొరుగు రాష్ట్ర మత్స్యకారులు మన పరిధిలోకి రాకుండా తీర ప్రాంతంలో నిఘా పెడతామని తెలిపారు.

స్థానిక మత్స్యకారులకు అన్యాయం జరగకుండా ముఖ్యమంత్రిగా తనది బాధ్యతన్నారు. తీర ప్రాంత నిఘాను గత వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. నిఘా కోసం గతంలో తాము 12 బోట్లను ఏర్పాటు చేశామన్నారు. వైసిపి ప్రభుత్వం వీటిని పక్కన పెట్టేసి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నిఘా కోసం తక్షణమే రెండు బోట్లను కొనుగోలు చేస్తామన్నారు. ఒక్కొక్క బోటు విలువ 1.50 కోట్ల వరకూ ఉందని తెలిపారు. అవసరమైతే మరిన్ని నిఘా బోట్లను కొనుగోలు చేస్తామన్నారు. మత్స్యకారుల సేవా పథకం ద్వారా మత్స్యకార జీవన భృతిని రూ.20 వేలకు పెంచామని తెలిపారు. మత్స్యకారుల పొట్టగొడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 217 ఒకను రద్దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, టిడ్కో ఎమ్‌డి అజరుజైన్ పాల్గొన్నారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

**మొదటిపేజీ తరువాయి**



ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర

**హైదరాబాద్,,మార్చి 30 ఆంధ్ర ప్రగతి**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు.ం

# నెమళ్లకుంట గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.

**కలెక్టర్ దత్తత గ్రామంలో పలు కార్యక్రమాల ప్రారంభం.**

**ఆర్.ఓ ప్లాంట్, సీసీ రోడ్లు, గృహాల ప్రారంభోత్సవం.ద -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**







**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు/ నంద్యాల, మార్చి 30:** బండిఆత్మకూరు మండలంలోని పి4 కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి దత్తత తీసుకున్న నెమళ్లకుంట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఆర్.ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా ఐటిడిఎ సంస్థ నిర్మించిన కమ్యూనిటీ భవనం, గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన గృహాలను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జి.సి. పాలెం గ్రామం నుండి నెమళ్లకుంట గ్రామంలోని ఎంపీపీ పాఠశాల వరకు నిర్మించిన సీసీ రోడ్డును కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన "పి4 మార్గదర్శి - బంగారు కుటుంబం" కార్యక్రమం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.50 లక్షల గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని, నంద్యాల జిల్లాలో మొత్తం 1,987 గృహ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత ఏడాది కాలంలో ఈ నియోజకవర్గంలో సుమారు 29 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. నెమళ్లకుంట గ్రామంలో ప్రజల అభ్యర్థన మేరకు ఆర్.ఓ ప్లాంట్, గ్యాస్ సిలిండర్లు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. త్వరలో అంగన్‌వాడీ కేంద్రం కూడా పూర్తి కానుందని పేర్కొన్నారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవల పరంగా "మీ ఇంటికి మీ డాక్టర్" కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మొబైల్ హాస్పిటల్‌ను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రతిరోజూ సుమారు 100 కుటుంబాలకు వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నెమళ్లకుంట గ్రామంలోని చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ నెమళ్లకుంట గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా మినరల్ వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని వినియోగించుకుని ప్రజలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. కేవలం ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే రు.2.35 లక్షలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రు.1 లక్ష ఇవ్వడం ద్వారా ఒక్కో ఇంటికి రు.3.35 లక్షల ఆర్థిక సాయం అందుతున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇప్పటికే 26 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాల నియోజకవర్గంలో ఘనంగా గృహ ప్రవేశోత్సవాలు.

**లబ్ధిదారులకు ఇళ్లను అందజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 30:** నంద్యాల నియోజకవర్గ పరిధిలోని రైతు నగర్‌లోని శిల్పా నగర్‌లో నిర్మించిన గృహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లబ్ధిదారులకు ఘనంగా పంపిణీ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 2,50,893 ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నంద్యాలలో నిర్వహించిన ఈ గృహ ప్రవేశోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇళ్లలో నివాసం ప్రారంభించిన కుటుంబాలతో ముచ్చటించి వారి ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవారికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. సొంతింటి కల నిజమైన ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి ఫరూక్ గారికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, స్థానిక నాయకులు కోమలి హోటల్ మధు, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, అలాగే పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, లబ్ధిదారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు.

**వేసవి నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**

**కలెక్టర్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభించినజిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు అర్బన్, మార్చి 30:** ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. సోమవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఆవరణ లో ఏర్పాటు చేసిన తాగునీరు, మజ్జిగ పంపిణీ చలివేంద్రం ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, సిబ్బంది కోసం చలివేంద్రంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం ద్వారా స్వచ్ఛమైన తాగునీటితో పాటు చల్లని మజ్జిగను నిరంతరం అందుబాటులో ఉంచుతామన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున జిల్లాలోని ప్రధాన కూడళ్లలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో హౌసింగ్ పిడి చిరంజీవి, టూరిజం అధికారి నారాయణ, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించండి.

**డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 30:** ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా డిఆర్ఓ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలన్నారు.. అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. రీ-ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, అవి మళ్లీ పెండింగ్‌లో పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం.

**ప్రారంభించిన నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.**

**జిల్లా జట్టుకు ఎంపికైన వారు జూన్ నెలలో గుడివాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు**

**: జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి.**

**చదరంగం ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రవి కృష్ణ**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 29**

నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో,ఎన్.ఆర్.జి. చెస్ అకాడమీ గౌరవ చైర్మన్ రాజేష్ సౌజన్యంతో ఆదివారం స్థానిక ఈపూరి శేషయ్య శెట్టి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జింకా ఆడిటోరియంలో 15 సంవత్సరాలలోపు బాల బాలికలకు వేరువేరుగా జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవం కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ రిబ్బన్ కత్తిరించి టోర్నమెంట్ ను లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ ఏకాగ్రతను ఇనుముడింప చేస్తుందని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు అధికమవుతాయని అన్నారు. మొబైల్ ఫోన్ పిల్లలలో దుష్ప్రభావం చూపుతున్నదని,దాని నుంచి పిల్లల దృష్టి క్రీడలపై ఉండేలా చేస్తే పిల్లలలో మేధో వికాసం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళలలో పాల్గొనడం వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు.విద్యార్థులు క్రీడలలో పాల్గొంటే క్రమశిక్షణ కూడా అలవడుతుందని అన్నారు. గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం అలబడుతుందని , తద్వారా చిన్న విషయాలకు కృంగి పోకుండా



ఉండడానికి క్రీడలు తోడ్పడతాయని అన్నారు. క్రీడలలో క్రమం తప్పని నిరంతర సాధన విజయానికి సోపానం అన్నారు.నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈరోజు జరిగే పోటీలలో విజేతలుగా నిలిచిన వారు జూన్ నెలలో గుడివాడలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ల తేదీలను ప్రకటించిందని, తదనుగుణంగా జిల్లా జట్టు ఎంపిక టోర్నమెంట్లు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, నంద్యాల లయన్స్ క్లబ్ కోశాధికారి అమిదేల జనార్ధన్, టోర్నమెంట్ కోఆర్డినేటర్ వెంకటరావు, టోర్నమెంట్ ఆర్బిటర్ సుజాత,150 మంది క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ, కర్నూలు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సదస్సు.

**సదస్సులో ప్రసంగించిన కర్నూలు కిమ్స్ కడల్స్ తల్లి,చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు.**

**చిన్నపిల్లల వైద్యంలో వివిధ అంశాలపై ప్రసంగించిన చిన్నపిల్లల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సాయి ప్రసూన, చిన్నపిల్లల క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ రవికిరణ్, నవజాత శిశువుల వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ నవీద్.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 29:**

భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, కర్నూలు కిమ్స్ ఆసుపత్రి కడల్స్ తల్లి,చిన్నపిల్లల వైద్య విభాగం సహకారంతో స్థానిక ప్రైవేట్ హోటల్ సమావేశ భవనంలో వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు,జాతీయ ఐ.ఎం.ఎ. కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ సదస్సు ప్రారంభించారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రి చిన్నపిల్లల శస్త్ర చికిత్స వైద్యనిపుణులు డాక్టర్ సాయి ప్రసూన చిన్నపిల్లలలో మూత్ర వ్యవస్థ శస్త్ర చికిత్సలు, చిన్నపిల్లల అత్యవసర చికిత్సలో నూతన విధానాలపై డాక్టర్ రవి కిరణ్ , నవజాత శిశువుల వైద్య చికిత్సలో ఆధునిక విధానాలపై డాక్టర్ అబ్దుల్ నవీద్ లు మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకుంటూ, కొత్తగా ఆవిష్కరించిన ఆధునిక వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వక్తలను ఐఎంఏ నంద్యాల తరపున జ్ఞాపికలు అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ మహమ్మద్ రఫీ లతోపాటు ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,నంద్యాల ఐ.ఎం.ఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, కిమ్స్ ఆసుపత్రి పరిపాలన సిబ్బంది నందయ్య,ఫయాజ్ అహ్మద్,అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.





ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా చదరంగం జట్టు.

**15 సంవత్సరాల లోపు జిల్లాస్థాయి ఓపెన్ బాల,బాలికల చెస్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేసిన డాక్టర్ రవి కృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 30:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల జింకా ఆడిటోరియం లో నిర్వహించిన 15 సంవత్సరాల లోపు బాల,బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు తరుపున పాల్గొనడానికి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో మొదటి స్థానం శివ కార్తికేయ,రెండవ స్థానం హర్షిత్,మూడో స్థానం రషీద్ మహమ్మద్,నాలుగవ స్థానం భువన కార్తికేయ సాధించి బహుమతులు అందుకున్నారు. బాలికల విభాగంలో మొదటి స్థానం వెంకట దీక్ష శ్రీ,రెండవ స్థానం పద్మ నాగ నిఖిల,తృతీయ స్థానం ఆశ్రిత భారతి,నాలుగవ స్థానం తపస్య సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,ప్రధాన కార్యదర్శి జి.రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జూన్ నెలలో గుడివాడలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ఎంపికైన జట్లు నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. గెలిచినవారు భవిష్యత్తు టోర్నమెంట్ లలో మళ్లీ గెలవడానికి, విజయం సాధించని వారు తదుపరి పోటీలలో విజయం సాధించడానికి క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన అవసరమని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు కాకుండా వివిధ విభాగాలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ బహుమతి ప్రధానోత్సవం లో డాక్టర్ రవి కృష్ణ తో పాటు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి,ప్రకాశం డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండారెడ్డి,ఎన్ ఆర్ జి అకాడమీ వైస్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి ఆర్బిటర్ సుజాత, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒక్క ఉద్యోగం కుటుంబాన్ని పోషిస్తుంది.

**ప్రతి మూడు నెలలకోసారి జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం.**

**యువత ఉద్యోగాలు పొందేందుకు నైపుణ్యాలు నేర్చుకోవాలి.**

**కర్నూలులో జాబ్‌మేళా ప్రారంభించిన మంత్రి టీజీ భరత్ గుప్తా.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ మార్చి 30:**



ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 కంపెనీల్లో 1125 ఉద్యోగాలను ఈ జాబ్‌మేళా ద్వారా భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. యువతీ, యువకులు తగిన నైపుణ్యాలతో ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువత ఆ తర్వాత అదే కంపెనీలో స్థిరంగా ఉద్యోగం చేయాలన్నారు. కంపెనీలో పనికి తగ్గట్టు స్కిల్స్ కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓర్వకల్లుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా కంపెనీలు తీసుకొస్తున్నామన్నారు. జైరాజ్ ఇస్పాత్ కంపెనీని అప్పట్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని, ఇప్పుడు అదే కంపెనీ మరో రూ. 6వేల కోట్లతో పెట్టుబడి పెడుతోందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైన మేరకు ప్రభుత్వ ఉద్యోగాలు సైతం భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, ఏపీఐఐసీ డైరెక్టర్ జగదీష్ గుప్తా, డీఎస్పీ మెహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునికి ఒక కేజీ వెండి పడిగె విరాళం..!

**వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష విరాళం. -.. విద్యుత్ శాఖ ఎస్సీ సుధాకర్ రావు ప్రత్యేక పూజలు.**

**ఆంధ్ర ప్రగతి పాణ్యం మార్చి 29:**
ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఒక కేజీ 20 గ్రాముల వెండి నాగ పడిగెను ఆదివారం భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. నంద్యాల పట్టణము కు చెందిన ఏ.వెంకట నాయుడు కుమారుడు ఏ.శివ నాగేంద్ర వారి కుటుంబ సభ్యులు మొక్కుబడిగా ఒక కేజీ 20 గ్రాముల వెండి నాగ పడిగెను విరాళంగా ఇచ్చారు, వారికి ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

**2.వసతి గృహమునకు ఒక లక్ష విరాళం..!**
దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం భక్తులు సహకారంతో నిర్మించబడుతున్న అతిథి వసతి గృహమునకు భక్తులు ఒక లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. నంద్యాల పట్టణము స్టేట్ బ్యాంక్ కాలనీకి చెందిన నాగార్జున రెడ్డి సతీమణి సుజాత అన్నపూర్ణ కుమారుడు సుప్రణీత్ రెడ్డి కుటుంబ సభ్యులు మొక్కుబడిగా ఒక లక్ష రూపాయలు చెక్ ద్వారా విరాళంగా ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు నారాయణస్వామి, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. 3.కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో విద్యుత్ శాఖ ఎస్ఈ పూజలు. ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసి యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్) సుధాకర్ రావు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు



నారాయణస్వామి సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి పూలమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రసాదము స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఏడి సుబ్రహ్మణ్యం, ఏఈ మధుసూదన్ యాదవ్, లైన్ మెన్స్ గురప్ప, మిలిటరీ సుబ్బారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తేళ్లపురి గ్రామంలో అభివృద్ధి పనులను

## ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి గోస్పాడు/తేళ్లపురి, మార్చి 30:**
నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం నాడు భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు భూమిపూజ చేశారు. మంత్రి ఫరూక్ గ్రామంలో పూర్తయిన 9 రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. తేళ్లపురి కుందు నది నుండి దస్తగిరి స్వామి వరకు నూతనంగా నిర్మించిన సి.సి. రోడ్డు, జె.జె.ఎమ్ నిధుల కింద ఏర్పాటు చేసిన వాటర్ స్కీమ్, ఎస్.సి. కాలనీలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీ కాలువలు మరియు స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ స్కూళ్లు మరియు పాఠశాలల అభివృద్ధి పనులు. నూతన పనులకు భూమిపూజ: మంత్రి ఫరూక్ సుమారు 1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన పునరుద్ధరణ (జీర్ణోద్ధారణ) పనులకు భూమిపూజ నిర్వహించారు. వీటితో పాటు ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ మరియు మరికొన్ని సి.సి. రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం పల్లెల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు . తేళ్లపురి గ్రామ పంచాయతీలో నేడు సుమారు 9 అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం, మరిన్ని కొత్త పనులకు శ్రీకారం చుట్టడం సంతోషకరం." అని తెలిపారు. "సుమారు 1.25 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన జీర్ణోద్ధారణ పనులు చేపట్టడం జరిగిందని . గ్రామాల్లో భక్తిభావం, ఆధ్యాత్మికత పెంపొందేలా ఆలయాల



పునరుద్ధరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. గ్రామంలో సి.సి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మరియు సురక్షితమైన తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి ద్వారా భావి తరాలకు మెరుగైన విద్యను అందిస్తామన్నారు అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించడమైనదని . గ్రామ ప్రజలు కూడా అభివృద్ధి పనుల్లో భాగస్వాములై, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. రాబోయే రోజుల్లో తేళ్లపురిని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఈ కార్యక్రమంలో తేళ్లపురి గ్రామ సర్పంచ్ శ్రీమతి కాటంరెడ్డి సుధామణి, కే.సి. కెనాల్ డి.సి. ఛైర్మన్ మరియు గోస్పాడు మండల టి.డి.పి. అధ్యక్షులు కాటంరెడ్డి తులసీశ్వర రెడ్డి, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది మరియు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**జిల్లాలో ఘనంగా లబ్ధిదారుల గృహ ప్రవేశాలు.**

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీ.జీ.భరత్.**









**ఆంధ్ర ప్రగతి కర్నూలు రూరల్, మార్చి 30:**
పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీ.జీ.భరత్ తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల గృహ ప్రవేశాల సందర్భంగా జోహారాపురం లోని నజీబున్నిస బేగం, షేక్ గౌస్ బాషా ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీ.జీ.భరత్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పాల్గొని సంప్రదాయబద్ధంగా ప్రభుత్వం తరపున కొత్త బట్టలను లబ్ధిదారులకు బహూకరించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ గతంలో అద్దె ఇళ్లకు నెలకు ఎంత కిరాయి చెల్లించేవారు, ఇప్పుడు సొంత ఇళ్లు గృహ ప్రవేశం చేసుకున్న తర్వాత ఎలా అనిపిస్తుందని లబ్ధిదారులను ఆరా తీశారు.. గతంలో అద్దె ఇళ్లలో నెలకు కిరాయి చెల్లించడానికి చాలా ఇబ్బందులు పడేవారమని, అటువంటి తరుణంలో 2025 నవంబర్ లో సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా వెంటనే మాకు శాంక్షన్ అయిన డబ్బుతో గృహమును నిర్మించుకొని ఈరోజు గృహ ప్రవేశం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని లబ్ధిదారులు తమ యొక్క ఆనందాన్ని మంత్రి, కలెక్టర్ లతో పంచుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కట్టించుకోవడం అనేది ఒక కల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను ఒక ఎమోషన్‌గా పరిగణిస్తూ, వీటికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పేదవాడి ఇళ్ల నిర్మాణాల కలను సాకారం చేస్తున్నారన్నారు. పిఎంఏవై (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) పథకాలను సరిగ్గా వినియోగించుకుంటే, లబ్ధిదారులకు రూ. 2.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. అర్హత ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకున్న వారు గృహప్రవేశం చేసుకొని చాలా సంతోషంగా ఉన్నారన్నారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పురసేవ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ యాప్ లో నమోదైన సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి డ్యాష్‌బోర్డ్ కు అనుసంధానించబడి ఉంటాయని, దీనివల్ల జవాబుదారీతనం మరింత పెరుగుతుందని మంత్రి వివరించారు.

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047 10 సూత్రాలలో భాగంగా ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఇంకా 17 వేల మందికి ఇళ్ల స్థలాలు కావలసిన అవసరం ఉందని, దానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. పీఎం ఏవై 2.0 అర్బన్ కింద ఈరోజు లబ్ధిదారుల గృహ ప్రవేశాలు చేయడం జరిగిందన్నారు. పి ఎం ఏ వై 2.0 అర్బన్ లో వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉండి, సొంత స్థలం ఉన్న వారికి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇప్పటివరకు ప్రస్తుతం జిల్లాలో 2,600 ఇళ్లు మంజూరయ్యాయి, అందులో 1,000 ఇళ్లు గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన పనులను అక్టోబర్ లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా ఇంటి స్థలం ఉండి 3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నట్లయితే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం ఏవై 2.0 గ్రామీణ కింద స్వీకరించిన దరఖాస్తులలో 30,000 మంది అర్హులుగా ఉన్నారన్నారు. సంబంధిత వారికి యూనిట్ ధర 2.39 లక్షలతో ఇళ్లు మంజూరు చేయబడతాయన్నారు. పి ఎం ఏ వై 1.0 కి సంబంధించి గతంలో మంజూరైన 53,000 ఇళ్లలో 30,000 పూర్తయ్యాయన్నారు. మిగిలిన 20,000 ఇళ్లను సెప్టెంబర్ 2026 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఎాజ, దీజ మరియు ఎాు లబ్ధిదారులకు అదనంగా ₹50,000 నుండి ₹70,000 వరకు సాయం



అందించామన్నారు.


అంతకముందు కర్నూలు నగరంలోని శరీన్ నగర్ లో నాగన్న, లక్ష్మీదేవి ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమమును కలెక్టర్ ప్రారంభించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు సంప్రదాయబద్ధంగా ప్రభుత్వం తరపున కొత్త బట్టలను కలెక్టర్ బహూకరించారు.

కార్యక్రమంలో హౌసింగ్ పిడి చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నంద్యాలలో ఘనంగా 'స్టార్ పురిటి మరియు చిన్న పిల్లల ఆసుపత్రి' ప్రారంభం.

## ముఖ్య అతిథిగా విచ్చేసి ఆసుపత్రిని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 30:**
నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "స్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్" (స్టార్ పురిటి మరియు చిన్న పిల్లల ఆసుపత్రి) ఈరోజు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వంటి ఎదుగుతున్న పట్టణాల్లో చిన్నపిల్లలకు ప్రత్యేకమైన, అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. చెన్నైలోని మెహతా హాస్పిటల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో శిక్షణ పొందిన డాక్టర్ కార్తికేయ వంటి నిపుణులు ఇక్కడ సేవలు అందించడం వల్ల, అత్యవసర స్థితిలో ఉన్న శిశువులను వేరే నగరాలకు తీసుకెళ్లే అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలని, మానవీయ కోణంలో రోగులను సేవించాలని ఆసుపత్రి యాజమాన్యానికి మంత్రి ఫరూక్ సూచించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ కార్తికేయ కుమ్మిత మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో పురిటి సేవలతో పాటు, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక చికిత్సలు, 24 గంటల ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తమపై నమ్మకంతో విచ్చేసిన అతిథులకు, పట్టణ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, డాక్టర్ ప్రియాం కుమ్మిత, కుమ్మితి శ్రీనివాసులు , డాక్టర్ రవి కృష్ణ, మనం వినయ్ కుమార్, మిద్దె హుస్సేన్, ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వివాహానికి ఆర్థిక సహాయం

## అందజేసిన తాటికొండ బుగ్గరాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 30:**నంద్యాల టౌన్ 38వ వార్డు నందమూరి నగర్ నందు నివాసం ఉంటున్న పేద ముస్లిం మహిళా వివాహానికి మంత్రి ఎన్ ఎండి.ఫరూక్ వారి కుమారులు ఎన్ ఎండి.ఫిరోజ్,ఫయాజ్ ఆదేశాల మేరకు వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ వార్డు నందు ఎవరు మరణించిన, వార్డు నందు ఎవరి వివాహం జరిగిన వారికి ఆర్థిక సహాయం చేయడం జరుతుంది అని ఆయన అన్నారు. ఇప్పటికి దాదాపుగా వార్డు నందు 45 వివాహాలకు 30మంది మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కుటుంబ సభ్యులు మరియు స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన పసుపు వర్ణ ఆక్టివిటీ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 30:**నంద్యాల జిల్లాలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాల నందు పసుపు కలర్ ఆక్టివిటీని పాఠశాల చిన్నారులు మరియు ఉపాధ్యాయ బృందం ఎంతో ఆసక్తికరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపు వర్ణము దుస్తులు ధరించి పసుపు కలర్ వస్తువులు మరియు ఆహార పదార్థాలతో ఎంతో ఉత్సాహంగా పసుపువర్ణ ఆక్టివిటీని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత మేడం గారు మాట్లాడుతూ పసుపు వర్ణం శుభానికి సూచన అని తాజాదనానికి సంతోషానికి పాజిటివిటీగా,క్లారిటీగా శక్తివంతంగా, ఉత్సాహవంతంగా, నీతికి, నిజాయితీకి సూచకమని తెలిపారు. ఈ కలర్ ఆహార పదార్థాలు పిల్లలను ఎంతో ఆకర్షించడం ,చిన్నపిల్లల పడక గదిలో కూడా పిల్లలకి పాజిటివ్ తరంగాలను పడేలా పసుపు రంగు కలర్ గోడలకు పూస్తారు. ఇంత విశిష్టత కలిగిన పసుపు వర్ణం రోజున జరుపుకోవడం ఎంతో ఆనందకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ ప్రిన్సిపాల్ మాధవీలత విద్యార్థినీ,విద్యార్థులు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో బిజెపిని బలోపేతం చేయడమే నా లక్ష్యం.!

## నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.









**ఆంధ్ర ప్రగతి పాములపాడు మార్చి 30:**నంద్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభివృద్ధి మధు అన్నారు. సోమవారం నాడు నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడు మండలంలో నిర్వహించిన ప్రశిక్షణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పాల్గొని పార్టీ నిర్మాణం, బలోపేతంపై కీలక సూచనలు చేశారు. గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలని, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య చురుకుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలకు వివరంగా తెలియజేస్తూ, వాటిని ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అభిరుచి మధు తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న లాభాలను స్పష్టంగా వివరించి, పార్టీకి ప్రజల్లో మరింత మద్దతు తీసుకురావాలని సూచించారు. అలాగే మిడుతూరు మండలంలో జరిగిన ప్రశిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అభిరుచి మధు,



పార్టీ బలోపేతానికి శక్తివంతమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, యువతను పార్టీ వైపు ఆకర్షించాలని సూచించారు. క్రమశిక్షణ, సమన్వయం, కృషి ఉంటే పార్టీకి మరింత అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "పి 4"అంటే కేవలం నగదు బదిలీ కాదు..

# భావి తరాల జీవన ప్రమాణాల మార్పు.!

## రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్, మార్చి 30:**
బంగారు కుటుంబాల' అభివృద్ధి అంటే కేవలం నగదు బదిలీ కాదని.. వారి పిల్లల ఉన్నత భవిష్యత్తు, ఆలోచనా విధానం మరియు జీవనశైలిని మెరుగుపరచడమే పి 4' కాన్సెప్ట్ అసలు ఉద్దేశ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా వివరించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో "పి4 వార్షికోత్సవ స్వర్ణాంధ్ర ఏ 2047" కార్యక్రమమును నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏడాది క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్) కాన్సెప్ట్ ఒక కొత్త కాన్సెప్ట్ అన్నారు. (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ.) అంటే ఏదైనా అవసరం ఉన్నప్పుడు కేవలం డబ్బు సహాయం చేసి వదిలేయడం అన్నారు. కానీ పి 4 కాన్సెప్ట్ అనేది బంగారు కుటుంబాలకు కేవలం డబ్బు సహాయం చేయడం మాత్రమే కాకుండా, వారి పిల్లల భవిష్యత్తు, వారి ఆలోచనా విధానం మరియు జీవనశైలిని మెరుగుపరచడమే ఈ కాన్సెప్ట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జిల్లాలో మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంలో ఇంకా పెండింగ్ ఉందన్నారు. జిల్లాలో దాదాపు 59,000 మంది బంగారు కుటుంబాలను, కర్నూలు నియోజకవర్గంలో 2,137 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. ఇక్కడ హాజరైన మార్గదర్శులందరూ మీ వారందరికీ దీని యొక్క ప్రాముఖ్యతను వివరించి, దత్తత తీసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు.. డాక్టర్లు, రియల్టర్లు,



వ్యాపారవేత్తలు మరియు బంగారు నగల వ్యాపారుల వద్దకు వెళ్లి ఈ కాన్సెప్ట్ గురించి వివరించి, వారిని భాగస్వాములను చేయాలని మంత్రి సిపిఓ కి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ధనిక మరియు మధ్యతరగతి వర్గాల వారికి అవగాహన కల్పించేలా టీమ్‌లను పంపాలని మంత్రి సిపిఓ కు సూచించారు. దత్తత తీసుకునే ప్రక్రియలో నిజంగా అర్హులైన వారు ఎవరో గుర్తించి ముందుకు వెళ్లడం చాలా ముఖ్యం అన్నారు. పేదరికం లేని సమాజం సాధించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఉన్న పెండింగ్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటే ఒక రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందో మహారాష్ట్ర, గుజరాత్ ఒక ప్రధాన ఉదాహరణ అన్నారు. సింగపూర్, దుబాయ్ వంటి విదేశాలను చూసినా, అక్కడ స్థిరమైన ప్రభుత్వాలు ఉండటం వల్లే అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంక్షోభాలు ఉన్నా, మోదీ నాయకత్వంలో భారతదేశం సురక్షితంగా ఉందన్నారు. ప్రస్తుతం అరబ్ దేశాల నుండి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి చాలా ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ పేదరిక నిర్మూలన కోసం పాటుపడటమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. పేదరికం అంటే కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని, మౌలిక వసతులు, విద్య మరియు వైద్య సౌకర్యాలు లేకపోవడం కూడా అని కలెక్టర్ వివరించారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు లేదా నైపుణ్యం కలిగిన వ్యక్తులు మరియు సంస్థలు మార్గదర్శులుగా వ్యవహరిస్తారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం ఈ పథకం యొక్క లక్ష్యం అన్నారు. సమాజంలో ఆర్థికంగా బాగున్న 10% మంది వ్యక్తులు, వెనుకబడిన 20% మందిని దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పడతారన్నారు.

జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఒక ఊరిలో బ్రిడ్జి నిర్మాణం, పాఠశాలలో ప్లేగ్రౌండ్ లెవలింగ్ మరొక్క పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఒక ప్రాంతంలో లైబ్రరీ ఏర్పాటు, పైప్‌లైన్ పనుల ద్వారా దాదాపు 200 కుటుంబాలకు నీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలో మరియు నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ యూనిట్లలో యువ నిపుణులను భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు మరియు అధికారులకు మధ్య వారు ఒక వారధిలా పనిచేస్తారన్నారు. గ్రామాల్లో ఉన్న అవసరాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావడం, అలాగే 'మార్గదర్శులు' ఆ గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ మౌలిక సదుపాయాలను కల్పించడం వంటివి చేస్తారన్నారు. జిల్లాలోని పెద్ద కంపెనీలు మరియు సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఇప్పటికే 91 వేల కుటుంబాలు మార్గదర్శులుగా నమోదయ్యాయన్నారు. ౹౨4 కార్యక్రమం ద్వారా 32 వేల కుటుంబాలకు చేయూతను అందించడం జరిగిందన్నారు.

జిల్లాలో పి 4 కార్యక్రమం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయన్నారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని రాయనగర్ వార్డు నంబర్ 37 ప్రాంతంలో మార్గదర్శి శ్రీమతి గుడిసె కృష్ణమ్మ లక్ష రూపాయల వ్యయంతో ఐరన్ బ్రిడ్జిని నిర్మించారన్నారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామం ఎన్టీఆర్ కాలనీ లో మార్గదర్శి రాకేష్ రెడ్డి లక్ష రూపాయలతో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి 200 కుటుంబాలకు నీటి సౌకర్యం కల్పించారన్నారు. ౹౨4 అనేది కేవలం ఒక పథకం మాత్రమే కాదని, ఇదొక సామాజిక ఉద్యమమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే 'జీరో పావర్టీ' (పేదరికం లేని సమాజం) లక్ష్యాన్ని సాధించగలమని కలెక్టర్ పేర్కొన్నారు.

అనంతరం టీబీ పేషెంట్స్ మరియు న్యూట్రిషన్ కోసం 15 లక్షల రూపాయలు విరాళం ఇచ్చిన, అమరావతిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కోటి రూపాయలు విరాళం ఇచ్చిన, జిల్లాలోని అనేక సాంస్కృతిక మరియు కళారంగ కార్యక్రమాలకు చేయూతనిచ్చిన, జి జి హెచ్ పే బ్లాక్స్ కోసం కోటి రూపాయలు విరాళం ఇచ్చిన, అలాగే ఉర్దూ యూనివర్సిటీకి కూడా కోటి రూపాయలు విరాళంగా ఇచ్చిన మంత్రి గారికి కలెక్టర్ ఘన సన్మానం చేశారు. అదే విధంగా మార్గదర్శులు విజయమ్మ, డా. సుధాకర్ రావు, తిరుపల్ రెడ్డి, కే.వి.సుబ్బారెడ్డి, ఆర్సనల్ మెటల్ ఎగ్జిక్యూటివ్ వారికి ఘన సన్మానం చేశారు.

కార్యక్రమంలో డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, సిపిఓ భారతి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లు, మార్గదర్శకులు, బంగారు కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిపై అసెంబ్లీ తీర్మానం..
# అభివృద్ధి వ్యూహమా..? రాజకీయ డ్రామాలా..?

## -ఎమ్మెల్సీ ఇసాక్ బాష.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 30:**
ఏపీ రాజకీయాల్లో మళ్లీ అమరావతి ప్రకంపనలు మొదలయ్యాయి. ఒకవైపు 2028 కల్లా రాజధానిని పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతుంటే.. మరోవైపు ఇదంతా ఒక 'డైవర్షన్ పాలిటిక్స్' అని వైసీపీ ప్రతిపక్షం మండిపడుతోంది. అసెంబ్లీలో తీర్మానం చేయడం కేవలం రెండో విడత ల్యాండ్ పూలింగ్ కోసం ఆడుతున్న డ్రామా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. అసలు అమరావతిలో జరుగుతున్నదేంటి? అభివృద్ధియా లేక కేవలం అప్పుల కుప్పా? ఈ అంశంపై నేడు నంద్యాల వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష అధ్యక్షతన వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నేతలు మీడియా సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఇసాక్ బాషా , వైసీపీ నేతలు మాట్లాడుతూ..."అమరావతిపై ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన తీర్మానం ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందన్నారు. అధికారంలో ఉండి, అడ్డుకునే వారు ఎవరూ లేకపోయినా.. తీర్మానాల పేరుతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 2028 గడువు విధిస్తూనే, 'రాజధానిని ఎవరైనా మార్చేస్తారు' అనే ప్రచారం చేయడం.. కూటమి ప్రభుత్వం నేతలకు వారిపైనే నమ్మకం లేదని సూచిస్తోందని ఆరోపించారు." రాజధాని అమరావతి నిర్మాణం కొరకు ఖర్చుల లెక్కలు మొదటి దశకే లక్ష కోట్లు, రెండో దశకు మరో 50 వేల కోట్లు.. ఇలా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల భారాన్ని రాష్ట్రం మోయగలదా? అని కూటమి నేతలను సూటిగా ప్రశ్నించారు. టెండర్ల పారదర్శకతలో స్క్వేర్ ఫీట్‌కు 11వేల రూపాయలు ఖర్చు చూపడం వెనుక ఉన్న మతలబు ఏంటి? 4% ఎక్సెస్‌తో తమ అనుచరులకే కాంట్రాక్టులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని విమర్శించారు.

ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియదు, రోడ్లు లేవు, అభివృద్ధి లేదు. అమరావతి పేరుతో రైతులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని చెబుతూనే 47వేల కోట్ల అప్పులు చేయడం, 5వేల కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లుగా ఇవ్వడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు.

విపక్షాల ప్రధాన ఆరోపణ. అమరావతి నిజంగానే ఆంధ్రుల ఆత్మగౌరవ కేంద్రంగా మారుతుందా లేక అవినీతికి అడ్డాగా మారుతుందా? ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రెండో విడత పూలింగ్ వెనుక అసలు మాస్టర్ ప్లాన్ ఏంటి?లక్షల కోట్ల ఖర్చు.. అప్పుల భారం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నీలినీడలు ముసురుతున్నాయన్నారు.

రాజధాని నిర్మాణం టెండర్లలో గూడుపుఠాణి ఉందని, 4% ఎక్సెస్ వేయడం అవినీతికి తార్కాణం అన్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అయితే రూ. 47,000 కోట్ల అప్పు ఎందుకన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కౌన్సిల్ నెంబర్స్ గోపవరం సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, రాష్ట్ర అగ్రికల్చర్ జాయింట్ సెక్రెటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాభూన్నిసా, నంద్యాల జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసిపి జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, వైసిపి జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసిపి జిల్లా సెక్రటరీలు దేవ నగర్ బాషా, శివ నాగిరెడ్డి. మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.32.29 లక్షలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది, మార్చి 30:**



మహానంది పుణ్యక్షేత్రంలో మహానందీశ్వర స్వామివారి హుండీ, ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 32,29,396 లక్షలు ఆదాయం వచ్చినట్లు మహానంది దేవస్థానం ఈవో ఎన్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మహానంది ఆలయంలోని అభిషేకం మండపంలో స్వామివారి హుండీతో పాటు ఉభయ దేవాలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 31 రోజులకు గాను స్వామివారికి రూ. హుండీ కానుకల ద్వారా రూ. 31,91,727, అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ. 22,986 , గో సంరక్షణ హుండీ ద్వారా రూ. 14,683, మొత్తం రూ. 32,29,396.లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖా తరుపున బండిఆత్మకూరు గ్రూప్ టెంపుల్ ఈఓ ఏ. నాగప్రసాద్, మహానంది దేవస్థాన ఏఈఓ మధు, పర్యవేక్షకులు, ఇన్స్పెక్టర్లు మరియు ఆలయ అర్చకులు, సిబ్బంది, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన బాలాజీ సేవా ట్రస్ట్, తిరుమల బాలాజీ సేవా సమితి సేవకులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు మార్చి 30:**



పేద ప్రజల సొంతిల్లు కలను సాకారం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద ఎమ్మిగనూరు పట్టణంలోని శివన్న నగర్ 6వ వార్డులో నిర్మించుకున్న గృహాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు ముల్లా మెహరూన్ బీ కొత్త గృహంలో అడుగుపెట్టిన సందర్భంగా సంప్రదాయబద్ధంగా ప్రభుత్వం తరపున కొత్త బట్టలను, ఇంటి పత్రాలు ఎమ్మెల్యే మరియు జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారురాలు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గృహహీనులందరికీ సొంత ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన నివాసం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-అర్బన్) ద్వారా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మెహరున్ బీకి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 1.00 లక్షలు కలిపి మొత్తం రూ. 2.50 లక్షల సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి స్థలం కలిగి ఉన్న అర్హులైన వారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-అర్బన్) పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ ఎస్.వి ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్ లో
# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 29:**
నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీ సంకల్ప ఒలింపియాడ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం ఆహ్లాదకరమైన స్వాగత నృత్యంతో ప్రారంభమై, అనంతరం దీపప్రజ్వలన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో చైర్మన్ సుధాకర్ , ఆయన సతీమణి రమ్య రెడ్డి , ప్రిన్సిపాల్ దివ్య కోషి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. యూ. కే. జీ చిన్నారుల అందమైన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ.."పిల్లలలో విద్య అంటే కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా, విలువలు, ఆత్మవిశ్వాసం మరియు మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం ముఖ్యమని, ఈ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు....అలాగే, "ప్రతి చిన్న అడుగు ఒక పెద్ద విజయానికి నాంది. ఈరోజు ఈ గ్రాడ్యుయేషన్ వేడుక వారి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి" అని అన్నారు.ప్రిన్సిపాల్ కూడా పిల్లల అభివృద్ధి, వారి సాధనలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ దశలను సూచిస్తూ పిల్లలు ఒక్కొక్కరిగా రింగ్స్ ద్వారా ప్రవేశించడం జరిగింది. ఇది వారి విద్యా ప్రయాణాన్ని ప్రతిబింబిస్తూ, వారు సాధించిన విజయాలను గుర్తుచేసే విధంగా రూపొందించబడింది.

అదేవిధంగా, పిల్లల చేతుల ద్వారా 'విజ్ఞాన దీపం' అందించడం ద్వారా పాఠశాల వారు విద్య అనే వెలుగును వారికి అందించినట్లు భావోద్వేగంగా ప్రతిబింబించారు.

కిచెన్ డాన్స్, పీకాక్ డాన్స్, ఏంజెల్ డాన్స్, మోనో యాక్ట్..వంటి వివిధ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో కలిసి స్టేజ్‌పై నృత్యాలు చేసి, ఆ రోజును మరింత ప్రత్యేకంగా మార్చుకున్నారు. ఈ సందర్భం వారికి జీవితాంతం నిలిచే మధుర జ్ఞాపకంగా నిలిచింది.గ్రాడ్యుయేట్ అయిన 54 పిల్లలకు సర్టిఫికెట్లు, మెడల్స్ మరియు వారి ఫోటోలతో ప్రత్యేకంగా తయారు చేసిన బహుమతులు అందజేశారు. కార్యక్రమ ప్రాంగణం పిల్లల ఫోటోలు మరియు వారి జ్ఞాపకాలతో అలంకరించబడుతూ రంగురంగుల వాతావరణాన్ని సృష్టించింది.మొత్తం కార్యక్రమం ఆనందభరితంగా, ఆహ్లాదంగా నిర్వహించబడింది... చివరిగా



పాఠశాల నిర్వహణ వారు... పిల్లలకు తోడ్పడిన తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతూ, రుచికరమైన అల్పాహారాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ముగించారు.

# క్రికెట్ అనేది వినోదం కొరకు మాత్రమే....

## బెట్టింగ్ కు ఆశపడి భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దు.

## నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మార్చిన 30:**
ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు (ఇండియన్ ప్రీమియర్ లీగ్) జరుగుచున్న నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన కీలక సూచనలు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులపై, ఆన్‌లైన్ బుకీలపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిరంతర నిఘా ఉంటుంది. బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా పాల్గొన్నా అలాంటి వారిని ఉపేక్షించేది లేదని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడకండి. కష్టపడకుండా వచ్చే సొమ్ము శాశ్వతం కాదు, అది మీ భవిష్యత్తును అంధకారం చేస్తుంది. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. స్మార్ట్ ఫోన్‌లలో వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏ పనుల కోసం స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తున్నారు అనేది గమనిస్తూ ఉండాలి.

"క్రికెట్ ఒక వినోదం మాత్రమే. దానిని జూదంగా మార్చి కుటుంబాలను వీధిన పడేయకండి. ఒక్క తప్పుడు అడుగు మీ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల కలలను చిన్నాభిన్నం చేస్తుంది."జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.

బెట్టింగ్ వల్ల అప్పుల పాలు కావడమే కాకుండా, సామాజికంగా గౌరవం కోల్పోవాల్సి వస్తుంది. బాల్-టు-బాల్ బెట్టింగ్, ఆకర్షణీయమైన



ఆఫర్ల వెనుక పెద్ద మోసం దాగి ఉంటుంది.

మీ పరిసరాల్లో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

**976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ -నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు**

**ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్**

**అమరావతి,మార్చి 30 ఆంధ్ర ప్రగతి**



ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెలి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.

# ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

## మతం మారిన క్రైస్తవులు ఎస్సీ చెప్పిన హోదాను పొందలేరు అనే తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం పునః పరిశీలించాలి.

### ఈ కేసు పై కేంద్ర ప్రభుత్వం పిల్ దాఖలు చేయాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 30:**
భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారము రాష్ట్రపతికి ఒక రాష్ట్రము లేదా కేంద్ర పాలిత ప్రాంతంలో షెడ్యూల్డ్ కులాల జాబితాను నోటిఫై చేసే అధికారాన్ని భారత రాజ్యాంగం కల్పించింది. గవర్నర్ తో సంప్రదించి నిర్దిష్ట కులాలు తెగలను ఎస్సీలు గా రాష్ట్రపతి గుర్తించవచ్చు. అయితే ఈ జాబితాను సవరించే అధికారము చేర్చడం కానీ తొలగించడం కానీ పార్లమెంట్కు మాత్రం ఉంటుంది. అదేవిధంగా ఆర్టికల్ 341 క్లాజ్ (1) ప్రకారం, రాష్ట్రపతి పబ్లిక్ నోటిఫికేషన్ ద్వారా షెడ్యూల్డ్ కులాలను గుర్తిస్తారు. అదేవిధంగా ఆర్టికల్ 341 క్లాజ్ (2) ప్రకారం పార్లమెంటుకు అధికారం ఉంటుంది., అయితే పార్లమెంటు చట్టం ద్వారా మాత్రమే ఈ జాబితాలో మార్పులు చేయగలరు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎట్టి పరిస్థితుల్లో ఈ అధికారము ఉండదు. ఎస్సీ లో జాబితా రాష్ట్రాలు వారిగా మారుతుంది. ఒక రాష్ట్రంలో ఎస్సీలు గా గుర్తించబడిన కులము మరొక రాష్ట్రంలో గుర్తించబడకపోవచ్చు. సాధారణంగా హిందూ, సిక్కు, బౌద్ధమతం తదితర మతాలను ఆచరించే వారు ఈ ఆర్టికల్ కింద షెడ్యూల్డ్ కులాలుగాపరిగణించబడతారు.

### దేశంలో దళిత క్రైస్తవులు, దళిత ముస్లిములు, సామాజిక అణిచివేతకు, కుల వివక్షతకు, అవమానాలకు గురవుతున్నారు

దేశంలో మతమార్పిడి చెందిన దళితులు ఇప్పటికీ సామాజిక అణిచివేతకు,అంటరానితనము అవమానములను ఎదుర్కొంటూనే ఉన్నారు. దళితులు క్రైస్తవ మతం మారినా కూడా కుల వివక్షత కొనసాగుతూనే ఉంది ఈ దేశం వదిలి విదేశాలకు పోయిన కూడా కులం వెంటాడుతూనే ఉంది అందుకు ఈ విషయాలను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణలోకి తీసుకొని తీర్పును లోతైన అధ్యయనం ద్వారా పరిశీలించాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధం మతాలకు మాత్రమే పరిమితం చేయడం చాలా అన్యాయం ఈ విధానాన్ని క్రైస్తవ, ముస్లిం మతాలకు వర్తించే విధంగా సుప్రీంకోర్టు పునః పరిశీలించాలని దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా కొన్ని దశాబ్దాలుగా క్రైస్తవ ,ముస్లిం మతాలను స్వీకరించిన





దళితులు ఈ మతాలకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ ప్రధాన డిమాండ్తో ఉద్యమము నేటికి కొనసాగుతూనే ఉంది.

మన దేశం లౌకిక రాజ్యం అంటే మతపరమైన విషయాలలో ప్రభుత్వాలు తటస్థంగా ఉంటూ ఏ ఒక్క మతానికి అధికారిక గుర్తింపు లేదా ప్రాధాన్యతలు ఇవ్వని రాజ్యం,మనదేశంలో పౌరులు అందరూ తమకు నచ్చిన మతాన్ని ఆచరిస్తూ ప్రచారం చేసుకునే స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించింది. చట్టం ముందు, ప్రభుత్వ పథకాలలో మతపరమైన వివక్ష ఉండకూడదు అనే విషయాలను మనం రాజ్యాంగంలో ఈ అంశాలన్నీ కూడా చదువుకుంటూ ఉంటాం. లౌకిక రాజ్యం యొక్క ప్రధానమైన లక్షణాలు రాజ్యానికి మతం లేదు రాజ్యానికి అధికారిక మతం అంటూ ఏది ఉండదు. ప్రభుత్వము ఏ మతాన్ని ప్రచారము చేయదు మరియు నిరుత్సాహపరచదు. మతపరమైన విషయాలలో తటస్థంగా ఉంటుంది ప్రభుత్వము మతపరమైన వ్యవహారాల నుండి వేరుగా ఉంటుంది. కానీ అవసరం అయితే సామాజిక సంస్కరణల కోసం మతపరమైన ఆచారాలలో జోక్యం చేసుకోవచ్చు. అదేవిధంగా సమానత్వం మతంతో సంబంధం లేకుండా రాజ్యాంగము ద్వారా పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించబడ్డాయి

మత స్వేచ్ఛ ప్రతి వ్యక్తి తన నమ్మకం ప్రకారం జీవిస్తూ పౌరులు వారికి నచ్చే విధంగా పూజలు గాని ప్రార్థనలు గాని ప్రచారం చేసుకుని హక్కును రాజ్యాంగం కల్పించింది. భారతదేశం లౌకిక దేశం అంటూ నిత్యం మనం రాజ్యాంగంలోని నిబంధనల ద్వారా ఈ విషయాలన్నిటిని చదువుకుంటున్నాం అయితే 1976 వ సంవత్సరం నాటి 42.వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో "సెక్యులర్"లౌకిక అనే పదాన్ని చేర్చారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుండి 28 వరకు మత స్వేచ్ఛకు హామీ ఇస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కు ప్రధాన అంశాలు ఆర్టికల్ 25 మనస్సాక్షి యొక్క మతపరమైన స్వేచ్ఛ మరియు వృత్తి అభ్యాసం మరియు వ్యాప్తి యొక్క స్వేచ్ఛ గురించి వివరిస్తుంది. ఆర్టికల్ 26 మత సంబంధాల నిర్వహణకు స్వేచ్ఛ ఇస్తుంది, ఆర్టికల్ 27 ఇతర మతాలకు మద్దతు ఇవ్వడానికి పన్నులు చెల్లించే హక్కు కూడా కల్పిస్తుంది, ఆర్టికల్ 28 ప్రకారం కొన్ని విద్యా సంస్థలలో బోధన లేదా మతపరమైన ఆరాధనలో పాల్గొనే స్వేచ్ఛ కూడా రాజ్యాంగం కల్పించింది. రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులను సుప్రీంకోర్టు కాపాడవలసిఉంది.పాశ్చాత్య లౌకికవాదం మతం రాజ్యం పూర్తిగా వేరుగా ఉంటాయి అయితే భారతీయ లౌకికవాదం ప్రకారం రాజ్యం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుంది సర్వధర్మ సమభావన అవసరమైనప్పుడు జోక్యం కూడా చేసుకుంటుంది. 1950 సంవత్సరంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వులను భారత ప్రభుత్వం సవరించాలి.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చింతాడ ఆనంద్ పాల్ కేసుకు సంబంధించిన తీర్పు అనుసరిస్తూ సుప్రీంకోర్టు మతం మారిన షెడ్యూల్డ్ కులాలకు ఎస్సీ హోదా కోల్పోతారు అనే తీర్పును పునః పరిశీలించాలి. సుప్రీంకోర్టు ధర్మాసనం సామాజిక కోణాన్ని రాజ్యాంగ నైతికతను విస్మరించడం సరైనది కాదు. ఏదైనా ఒక అంశానికి సంబంధించి తీర్పు ఇచ్చే విషయంలో రాజ్యాంగంలో ఉన్న నియమనిబంధనలు, చట్టాలు, ఏంచెప్తున్నాయో పరిగణలోకి తీసుకొని తీర్పులు ఇవ్వడం న్యాయవ్యవస్థ ఆనవాయితీ అయితే దేశంలో షెడ్యూల్డ్ కులాలు వివక్షకు గురవుతూ అత్యంత అణగారిన సామాజిక వర్గాల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే విషయంలో మరియు దేశంలోని కుల వివక్ష సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందుకు పరిష్కరించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల పైన ఉన్నది.

### భారతదేశంలో దళితులు క్రైస్తవ మతం, ఇస్లాం మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోతుందా?

భారతదేశంలో వందల సంవత్సరాల నుంచి దళితులు కుల వివక్షను ఎదుర్కొంటున్నారు. మతం మారినంత మాత్రాన అంటరానితనము, సామాజిక అసమానతలు, అవమానాలు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మతం మారిన సమాజంలో దళిత క్రైస్తవులు లేదా ఇతర మతాలకు మారిన దళితులు ఇప్పటికీ వివక్షను ఎదుర్కొంటున్నారు చట్టపరంగా హిందూ బౌద్ధ సిక్కు మతాలు తప్ప వేరే మతం లోకి మారితే ఎస్సీ హోదా, రిజర్వేషన్లు, కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే సుప్రీంకోర్టు సామాజిక అణిచివేత వాస్తవాలను పరిశీలించాలి. దళితులు ఏ మతం మారిన దళితులుగా పుట్టిన వారిని సమాజం దళితులుగానే చూస్తుంది కులవివక్ష, అంటరానితనం మతంతో సంబంధం లేకుండా కొనసాగబడుతుంది. అందుకు కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవులను దళిత ఇస్లాం మతంలోకి మారిన వారిని పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీలు గా గుర్తించాల్సిన అవసరం ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం షెడ్యూల్డ్ కులాల హోదా, ప్రభుత్వ సదుపాయాలు, రిజర్వేషన్లు రద్దు అవుతాయని చెప్పడంతో దేశవ్యాప్తంగా దళితులలో అభద్రతాభావం ఏర్పడింది. కుల వ్యవస్థ హిందూ మతానికే పరిమితం కాదని ఇస్లాం ,క్రైస్తవం అంటే ఈ రెండు మతాలలో కూడా కులవిభేదాలు, ఆధిపత్య పోకడలు, దాడులు కుల అవమానాలు కొనసాగుతున్నాయి. మత మార్పిడి అనేది వ్యక్తిగత విశ్వాసం, భక్తి మాత్రమే కానీ కులం వల్ల కలిగే సామాజిక వివక్షను ఏ మతం కూడా తొలగించలేదు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, ఆర్టికల్ 25 లను నేరుగా ఉల్లంఘిస్తుంది. ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారత ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలి. పౌరులు ఏ మతాన్ని అనుసరించాలనేది ప్రతి పౌరుని వ్యక్తిగత అభిప్రాయము, ఇష్టం మీద ఆధారపడి ఉంది. దీనిని ఒక నిర్దిష్ట కులములో జన్మించడం వల్ల వచ్చే హక్కులతో ముడి పెట్టకూడదు. క్రైస్తవం, ఇస్లాం, లేదా హిందూ,సిక్కు ,బౌద్ధం వంటి మతాలకు మారినప్పటికీ, షెడ్యూల్డ్ కులాల వారు ఇప్పటికీ వివక్షకు అణచివేతకు అవమానాలకు దాడులకు గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్లోని, కారంచేడు, చుండూరు, నీరుకొండ, వెంపెంట, తదితర ప్రాంతాల్లో జరిగిన హత్యలు,లక్ష్మీపురం, గర్గపరు, మధ్యప్రదేశ్ లోని కైర్లంజి, తెలంగాణ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో దళితులపై జరిగిన అత్యాచారాలు దాడులు, విధంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలల్లో అత్యాచారాలు హత్యలు జరిగాయి, అయితే ఆంధ్రప్రదేశ్లో పై సంఘటనలో హత్యలకు గురైన అందరూ కూడా క్రైస్తవ మతాన్ని అనుసరించిన వారే. మరి ఇది భారతదేశంలో ఈనాటికి కంటికి కనిపించే కఠోర వాస్తవం. ఈ వాస్తవాలన్నీ దేశంలోనే అత్యున్నత వ్యవస్థలకు తెలిసిన విషయాలు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై పునః పరిశీలించాలని ప్రజాస్వామ్యవాదులు కోరుకుంటున్నారు



డా.జి.బాలస్వామి
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు
వ్యవస్థాపక అధ్యక్షుడు.
-పూలే అంబేద్కర్ జ్ఞాన కేంద్రం

# పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం మార్గదర్శి

**ప్రజల భాగస్వామ్యంతో సమాజంలో మార్పు పీ-4పై మంత్రి విశ్వాసం.**

**ఉద్యమంగా మారుతున్న పీ-4 కార్యక్రమం.**

**అడ్డంకులను అధిగమించి ముందుకు సాగుతున్న పీ-4 కార్యక్రమం.**

**జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 30:**
పేదరికం లేని సమాజ నిర్మాణమే పీ–4 కార్యక్రమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇంచార్జి మంత్రి, ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన "పీ4 వార్షికోత్సవ స్వర్ణాంధ్ర ఏ 2047" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రారంభించిన పీ4 కార్యక్రమంపై మొదట అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఏ మార్పు ప్రారంభించినా అడ్డంకులు సహజమని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసినట్లు తెలిపారు. పీ–4 కార్యక్రమం ప్రారంభమై సంవత్సరం పూర్తవుతున్న ఈ సందర్భంలో, ప్రజలలో సహకారం, బాధ్యతా భావం పెరిగి, సమాజంలో సానుకూల మార్పు కనిపిస్తోందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాకుండా, ప్రజలే ముందుండి చేపట్టే ఉద్యమంగా మారుతోందని వివరించారు. గ్రామ స్వరాజ్య భావనను గుర్తుచేసుకుంటూ, గతంలో గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవని, ప్రజలు కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకునే సంప్రదాయం ఉండేదని చెప్పారు. ఆ సహకార భావాన్ని తిరిగి తీసుకురావడమే పీ–4 కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు.

అనంతపురంలోని ఆర్డీటి సంస్థ సేవలను ప్రస్తావిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన "ఇండియా ఫర్ ఇండియా" కార్యక్రమంలో చిన్న చిన్న విరాళాల ద్వారా కోట్ల రూపాయలు సమీకరించగలిగిన దాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ఇది సమాజంలో ఇంకా ఉన్న మానవత్వానికి నిదర్శనమన్నారు. గత కొన్ని దశాబ్దాల్లో అభివృద్ధి జరిగినప్పటికీ, ప్రభుత్వాలపై ప్రజల్లో నమ్మకం తగ్గిందని, పీ–4 కార్యక్రమం ద్వారా కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలబడే వాతావరణం ఏర్పడుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. సహాయం చేయాలనుకునే వారు, అవసరం ఉన్నవారు ఒకే వేదికపై కలిసేలా సాంకేతిక వేదికలను మరింత బలోపేతం చేయాలని సూచనలు స్వాగతించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఒక సాధారణ పథకం కాకుండా, ఒక సంస్కృతి, ఒక ఉద్యమంగా కొనసాగాలని, ప్రతి ఒక్కరూ దీన్ని తమ సొంత కార్యక్రమంగా భావించి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమాజానికి చేసే సేవే శాశ్వతమని, మనం ఇచ్చే సహాయమే నిలిచిపోతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా పి 4 కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల ఫలితంగా రూపుదిద్దుకుని, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతోందని తెలిపారు. సమాజంలో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సేవా మూర్తులను గుర్తించి, వారికి ప్రభుత్వ స్థాయిలో గౌరవం ఇవ్వడం ఆనందదాయకమని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యల పరిష్కారం, చెరువుల పునరుద్ధరణ వంటి పనులను ప్రాధాన్యంగా చేపడుతున్న అధికారుల కృషిని ఆయన అభినందించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా బాలబాలికల వసతి గృహాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఉచిత అంబులెన్స్




సేవలను అందిస్తున్న దాతలను ప్రశంసిస్తూ, ప్రైవేట్ అంబులెన్స్ మాఫియా కారణంగా పేదలు ఇబ్బంది పడకుండా కట్టడి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వికలాంగులకు నెలకు సుమారు 10 ట్రై–సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న దాతల సేవలను కొనియాడిన మంత్రి, పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న విద్యాసంస్థల పాత్రను ప్రశంసించారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, అదే స్ఫూర్తితో అధికారులు కూడా ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి దృఢ సంకల్పంతో ప్రారంభించిన 'జీరో పావర్టీ పీ4' కార్యక్రమం సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని తెలిపారు. ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలు చేయూత అందిస్తే, పేద కుటుంబాలు కూడా ఎదిగి మరికొందరికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. గత సంవత్సరం మార్చి 30న ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఏడాది పూర్తైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయం పొందే వారిని 'బంగారు కుటుంబాలు', సహాయం అందించే వారిని 'మార్గదర్శకులు'గా పిలుస్తున్నామని తెలిపారు. జిల్లాలో 50,038 బంగారు కుటుంబాలను గుర్తించి, వాటిలో 49,865 కుటుంబాలను ఇప్పటికే 4,805 మంది మార్గదర్శకులతో అనుసంధానం చేశామని వెల్లడించారు. ఉపాధి, వైద్య సహాయం, విద్య, చిన్న వ్యాపారాలు వంటి అవసరాలకు మార్గదర్శకులు తోడ్పాటు అందిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా మరియు నియోజకవర్గ స్థాయిలో విజన్ ప్లాన్ యూనిట్లు ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాల కోసం రూ.80 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయం, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు వంటి అంశాల్లో బంగారు కుటుంబాలకు సహాయం అందుతోందని తెలిపారు. కలెక్టర్‌గా తాను 44 చెంచు కుటుంబాలను దత్తత తీసుకుని, వారికి గ్యాస్ కనెక్షన్లు, గృహావసరాలు, ఆర్ఓ ప్లాంట్లు, సిసి రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి పెద్ద మార్పును తీసుకురాగలదని, మార్గదర్శకులు అందిస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం మంత్రులు మరియు జిల్లా కలెక్టర్ సమక్షంలో, సమాజ సేవలో విశేషంగా కృషి చేసిన మార్గదర్శకులకు ప్రశంసాపత్రాలు అందజేసి, వారి సేవలను కొనియాడారు.

అగ్రి గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రంగారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి గ్రామాల్లో ఆర్ఓ ప్లాంట్లు






ఏర్పాటు చేసి, పేదలకు స్వచ్ఛమైన తాగునీరు అందించినందుకు ప్రశంసాపత్రం అందజేశారు. టేకూరు నాగేశ్వరరావు 'బంగారు కుటుంబం' కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించినందుకు సన్మానం చేశారు. గోపిరెడ్డి ప్రతాప్ రెడ్డికి వివిధ సంస్థలకు సహకరించి, బంగారు కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడినందుకు ప్రశంసాపత్రం అందించారు. మాయలూరు రవీంద్రనాథ్ రెడ్డికి కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలకు విశేషంగా సహకరించినందుకు గాను సత్కరించారు. సయ్యద్ జాకీవుల్లా బాషాకు మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించినందుకు ప్రశంసాపత్రం అందజేశారు. వేణుగోపాల్‌కు కమ్యూనిటీ అభివృద్ధికి, అవసరమైన వారికి సహాయం అందించినందుకు గాను సన్మానం చేశారు. ఈ సందర్భంగా సేవ చేసిన ప్రతి ఒక్కరూ సన్మానానికి అర్హులేనని మంత్రులు, కలెక్టర్ పేర్కొంటూ, సమాజ సేవలో ముందుండే వారికి అభినందనలు తెలిపారు.

